సాక్షి సూర్యాపేట

బుధవారం ၊ 29 ၊ నవంబర్ ၊ 2023



మట్టపల్లిలో నిత్య కల్యాణం
మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణం వైభవంగా సాగింది.



పోలీసుల కవాతు
నాగారం మండలంలో మంగళవారం ఐటీబీపీ కేంద్ర పోలీసు బలగాల ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు.



యాదాద్రిలో విశేష పూజలు
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో మంగళవారం సంప్రదాయ పూజలు వైభవంగా కొనసాగాయి.

న్యూస్‌రీల్

ఓటర్ టర్న్ అవుట్ సెల్ ప్రారంభం

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలో పోలింగ్ సరళి పరిశీలనకు జిల్లా స్థాయిలో ఓటర్ టర్న్ అవుట్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఓటర్ టర్న్ అవుట్ సెల్‌ను ఆయన ఎస్పీ రాహుల్‌హెగ్డేతో కలసి ప్రారంభించారు.

పూలే ఆశయ సాధనకు పాటుపడాలి



నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

భానుపురి (సూర్యాపేట): మహాత్మా జ్యోతిబాపూలే ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వసంత సత్యనారాయణ పిళ్లే కోరారు. మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతిని పురస్కరించుకొని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సూర్యాపేట పట్టణంలోని మహాత్మా గాంధీ రోడ్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కంచుకొమ్ముల వెంకట్, బయ్య మల్లికార్జున్, బెల్లి నరసయ్య, మన్నె హరిప్రసాద్, నరంశెట్టి రామారావు, అన్నపర్తి పద్మ, కోడూరి నిర్మల, అనసూయ, వెంకటమ్మ, న్యాయవాదులు కొంపెల్లి లింగయ్య యాదవ్, బొల్లెద్దు వెంకటరత్నం, ఏడేండ్ల అశోక్, శివకుమార్, బుద్ధ సత్యనారాయణ, చామకూరి నరసయ్య, మట్టపల్లి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు కరపత్రాల ఆవిష్కరణ

అర్వపల్లి: అర్వపల్లి శివారులోని హజ్రత్ ఖాజా నసీరుద్దీన్‌బాబా దర్గాలో వచ్చే నెల 8, 9వ తేదీల్లో జరగనున్న ఉర్సు ఉత్సవాలను విజయవంతం చేయాలని దర్గా నిర్వాహకులు కోరారు. ఈమేరకు మంగళవారం దర్గా వద్ద ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. 8న గంధం ఊరేగింపు, 9న దీపారాధన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో దర్గా సూపరింటెండెంట్ గోళ్లం నజాముద్దీన్ సోఫి, ముజవర్ సయ్యద్ అలీ, కాంట్రాక్టర్ సయ్యద్ హబీబ్, సయ్యద్ అహ్మద్, గడ్డం సౌమ్య పాల్గొన్నారు.

నేడు, రేపు వ్యవసాయ మార్కెట్‌కు సెలవు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం 31,295 బస్తాల ధాన్యం రావడం, కాంటాలు ఆలస్యం కావడంతో బుధవారం మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. ఎన్నికలు ఉండటంతో 30వ తేదీ కూడా సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు.



ఎన్నికల ప్రచారం చివరి రోజైన మంగళవారం తిరుమలగిరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి గాదరి కిశోర్ నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన పార్టీ శ్రేణులు



హుజూర్‌నగర్‌రూరల్: అమరవరంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ష్.. గప్‌చుప్

ముగిసిన ఎన్నికల ప్రచారం
- ఆఖరి రోజు అభ్యర్థుల హడావిడి
- రోడ్ షోలు.. బైక్ ర్యాలీలు.. కార్నర్ మీటింగ్‌లు
- నామినేషన్ల రోజు నుంచి హోరెత్తిన ప్రచారాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జాతీయ, రాష్ట్ర నేతల పర్యటన
- 12 నియోజకవర్గాల సభల్లో పాల్గొన్న సీఎం కేసీఆర్



ఎన్నికల ప్రచారం ముగియడంతో ఫ్లెక్సీలు, మైకులు తొలగిస్తున్న వాహనదారులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ప్రచార పర్వానికి తెర పడింది. ఇంకా ఒక్క రోజు గడిస్తే ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన పోలింగ్ మొదలు కానుంది. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మంగళవారం సాయంత్రం 5 గంటలతో ప్రచారం ముగిసింది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఎలాంటి ఆర్భాటాలు లేకుండా ఐదుగురి కంటే తక్కువ మందితో కలిసి ఇంటింటి ప్రచారం చేసుకునే వీలుంది. ఈ నెల 3వ తేదీన నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఎన్నికల కోలాహలం మొదలైంది. రోడ్‌షోలు, బైక్ ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌లు, భారీ సభలతో ప్రచారాన్ని హోరెత్తించారు. ఆ పార్టీల జాతీయ, రాష్ట్రస్థాయి నేతలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రచారంలో పాల్గొన్నారు. ఇక, ప్రచారానికి ఆఖరి రోజైన మంగళవారం అభ్యర్థులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీలు నిర్వహించి బల ప్రదర్శనకు దిగారు.

హేమాహేమీల ప్రచారం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పన్నెండు నియోజకవర్గాల్లో పోటాపోటీగా అభ్యర్థులు ప్రచారం చేశారు. తమ అభ్యర్థుల గెలుపుకోసం ఆయా పార్టీల రాష్ట్ర నాయకత్వాలు, జాతీయ నాయకులు ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థుల తరపున సీఎం కె.చంద్రశేఖర్‌రావు 12 నియోజకవర్గాల్లో సభల్లో పాల్గొన్నారు. కేటీఆర్, హరీష్‌రావుల సభలు, రోడ్ షోలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ తరపున ప్రియాంక గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తదితరులు ప్రచారం చేశారు. ఇక బీజేపీ అభ్యర్థుల తరపున కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి శోభ కరంద్లాజే, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఈటల రాజేందర్, మంద కృష్ణ మాదిగ, పవన్‌కల్యాణ్ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. సీపీఎం అభ్యర్థుల తరపున సీతారాం ఏచూరి, బృందాకారత్ రోడ్‌షోలలో పాల్గొన్నారు.

డబ్బు, మద్యం పంపిణీకి సన్నద్ధం..!

ఓటర్లను నోట్ల కట్టలతో కొనడానికి రంగం సిద్ధమైంది. ఓటర్లకు డబ్బులు పంచడం ఆనవాయితీగా మార్చుకున్న ఆయా పార్టీలు ఆ ఏర్పాట్లలో మునిగిపోయాయి. ప్రధానంగా నియోజకవర్గాల్లోని ఏయే గ్రామాల్లో తాము బలహీనంగా ఉన్నామో ఇప్పటికే గుర్తించిన ఆయా పార్టీల నాయకులు, సదరు గ్రామాల్లో ఓట్ల కొనుగోలుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. కొన్ని చోట్ల ఓటుకు రూ.1000, మరికొన్ని చోట్ల రూ.2 వేల చొప్పున పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. డబ్బుతోపాటు మద్యం కూడా పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని చోట్ల ఇప్పటికే క్వార్టర్ మందు, థమ్సప్ బాటిళ్ల పంపిణీని షురూ చేశారు. మరోవైపు గిఫ్ట్‌ల రూపంలోనూ ఓటర్లను ప్రలోభపెడుతున్నట్లు తెలిసింది. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థుల అనుచరులు డబ్బుల పంపిణీని అడ్డుకునేందుకు గస్తీ కాయడం మొదలుపెట్టారు. ఎక్కడా డబ్బులు నిల్వ చేశారని అనుమానం ఉన్నా వెంటనే ఫిర్యాదు చేస్తున్నారు.

ప్రతి వంద ఓట్లకు ఒక ఇన్‌చార్జి

పోలింగ్ రోజున చేపట్టాల్సిన ఏర్పాట్లపై రాజకీయ పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. ముఖ్యంగా పోల్ మేనేజ్‌మెంట్‌పైనే ఆశలు పెట్టుకున్నాయి. ఓటర్లను పోలింగ్ బూత్ వరకు తీసుకువచ్చి ఓటు వేయించుకునే ప్రయత్నాల్లో నిమగ్నం అయ్యాయి. అధికార బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రతి వంద మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని నియమించి ఓటర్లను పోలింగ్ కేంద్రం వరకు తీసుకెళ్లేలా ప్రణాళికలు అమలు చేస్తున్నాయి. ఆ ఇన్‌చార్జిలు ఇప్పటికే పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల వివరాలను దగ్గర పెట్టుకొని అందరిని కలిశారు. ఇక వారికి అవసరమైన డబ్బు, మద్యం పంపిణీ, ఆ ఓటర్లను గురువారం పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లేలా చూడటంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.



సూర్యాపేటలో బీఆర్‌ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీష్ రెడ్డి నిర్వహించిన ర్యాలీ పాల్గొన్న ప్రజలు

interview



'బోగస్ మాటలు ఉండవు చెప్పింది చేసి చూపిస్తాం.. నీతి నిజాయితీ, పారదర్శకత, చిత్త శుద్ధి, ప్రజలే మా బలం.. మారుమూల ప్రాంతమైన హుజూర్‌నగర్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి గతంలో పనిచేశాను. ఇక ముందు కూడా పనిచేస్తా. అందు కోసమే పోటీ చేస్తున్నా. ప్రస్తుతం ఇక్కడ ఉన్న మాఫియాల దౌర్జన్యాలు, అరాచక పాలనను ప్రజలు చూశారు. గతంలో నేను ఎమ్మెల్యే అయిన తర్వాత చేసిన అభివృద్ధి తప్పా ప్రస్తుత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిందేమీలేదు' అని నల్లగొండ ఎంపీ, హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సాక్షితో ఉత్తమ్ ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. - హుజూర్‌నగర్

చెప్పింది చేసి చూపిస్తాం

బోగస్ మాటలు ఉండవు

నీతి, నిజాయితీ, పారదర్శకత, నిబద్ధతే నా బలం

అవే నా విజయానికి దోహదం చేస్తాయి

అంతా గతంలో నేను చేసిన అభివృద్ధే

బీఆర్‌ఎస్ హయాంలో ఒక్కటీ చేయలేదు

అవినీతి మాఫియా రాజ్యమేలుతోంది

కొత్త రైల్వే లైన్ తీసుకొస్తా

హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలు, గంజాయి, రౌడీ బ్యాచ్, వివిధ మాఫియాలు రాజ్యమేలుతున్నాయి. త్వరలోనే అవన్నీ బంద్ అయిపోతాయి. ఇక ముందు ఈ సంస్కృతి ఉండదు. వాటికి ప్రజలు చరమగీతం పాడబోతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు సరైన న్యాయం జరగ లేదు. నేను ఎమ్మెల్యే అయిన తర్వాత ప్రజలు ప్రశాంతగా జీవనం సాగిస్తారు. పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడతా. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం. గెలుపు విషయంలో మాకు కొత్తగా వ్యూహాలు అంటూ ఏమీలేవు. గతంలో మేము ప్రజలకు ఏ పనులైతే చేశామో అవే చెబుతున్నాం. అభివృద్ధి విషయంలో వెనకడుగు వేసేదిలేదు. మా నీతి నిజాయితీ, పారదర్శకత, చిత్తశుద్ధి గురించి ప్రజలకు వివరిస్తున్నాం. అవే మా గెలుపులో ప్రధాన భూమిక పోషిస్తాయి.

ఐటీపార్కు తీసుకొస్తా...

ఈసారి ప్రజల మద్దతుతో ఎన్నికల్లో గెలిచిన తర్వాత నియోజకవర్గంలో నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు ఐటీపార్కు తీసుకొస్తా. అంతే కాకుండా ప్రస్తుతం ఉన్న మేళ్లచెరువు–విష్ణుపురం రైలుమార్గంలో నూతనంగా ప్యాసింజర్ రైలు నడిపిస్తా. హుజూర్‌నగర్‌కు నూతన రైల్వే(ట్రాక్)లైన్ నిర్మాణానికి కృషి చేస్తా. దీనికి ప్రపోజల్ కూడా పెట్టాను. ఇది ఐదేళ్లలో పూర్తవుతుందని భావిస్తున్నా. నూతన పరిశ్రమల ఏర్పాటుకు కృషిచేస్తా. హుజూర్‌నగర్ పట్టణంలోని వంద పడకల ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా మార్పించేందుకు కృషి చేస్తా. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటా.

మోడల్ కాలనీ ఇళ్లను ఈ ప్రభుత్వం పట్టించుకోలేదు..

గతంలో నేను ఎమ్మెల్యేగా ఉండగా హుజూర్‌నగర్‌కు రింగ్ రోడ్డు, బైపాస్ రోడ్డు సౌకర్యం కల్పించా. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత రింగ్‌రోడ్డు ఉంది ఒక్క హుజూర్‌నగర్‌కు మాత్రమే. పదేళ్ల క్రితం నేను ప్రారంభించి దాదాపు 80 శాతం నిర్మించిన మోడల్ కాలనీ ఇళ్లను ఈ ప్రభుత్వం పట్టించుకోలేదు. దానిని పూర్తి చేయడానికి రకరకాల స్టేట్‌మెంట్లు ఇచ్చారు. బహుశా నేను మొదలు పెట్టిన ఇళ్లు కాబట్టి నేనే పూర్తి చేసి ప్రజలు ఇవ్వాలని రాసి ఉందేమో. నేనే వాటిని పూర్తిచేసి ప్రజలకు అందజేస్తా.

55 వేల ఎకరాల నూతన ఆయకట్టుకు నీరందించా..

గతంలో నేను ఎమ్మెల్యే అయినప్పుడు నియోజకవర్గం.. అభివృద్ధిలో చాలా వెనుక బడిఉంది. చుట్టూ నీరున్నా ఉపయోగించుకునే పరిస్థితి లేదు. నేను స్పందించి కృష్ణానది, మూసీ నది నీటిని ఉపయోగించి నూతనంగా లిఫ్టులు నిర్మించి కొత్తగా 55 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాను. కృష్ణానదిపై రూ. 50 కోట్లతో బ్రిడ్జి నిర్మించా. నియోజకవర్గంలో శిథిలమైన రోడ్లు, విద్యుత్ లోటట్టేజీ సమస్యలు ఉన్నాయి. వివిధ మండలాల్లో సబ్ స్టేషన్లు నిర్మించి లోటట్టేజీ సమస్య లేకుండా చేశా. ప్రతి ఊరిలో పాఠశాలలకు కొత్త భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మించాం. నా హయాంలో హుజూర్‌నగర్‌ను రాష్ట్రంలో ప్రత్యేక నియోజకవర్గంగా అభివృద్ధి చేశా.

ఒక్క ఓటుతో రెండు ప్రయోజనాలు



సంకినేని వెంకటేశ్వరరావుకు మద్దతుగా ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన ప్రజలు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

దురాజ్‌పల్లి (సూర్యాపేట): 'రెండు రోజుల్లో జరిగే ఎన్నికల్లో ఒక్క ఓటుతో రెండు ప్రయోజనాలు చేకూరే అవకాశం ఉంది.. ఆ ఓటుతో 67ఏళ్ల బీసీల అధికార కల, 30 సంవత్సరాల ఎస్సీ వర్గీకరణ పోరాటానికి ఫలితం దక్కనుంది.. బీసీలు, దళితులు బీజేపీకి ఓటు వేయాలి' అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం సూర్యాపేటలో బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వరరావుకు మద్దతుగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి తెలంగాణ వరకు ఒక్క బీసీకి రాజ్యాధికార అవకాశం దక్కలేదని, ప్రధాని మోదీ ఈ అవకాశం కల్పించారని, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లో ఉన్న బీసీలను పార్టీ మారమనడం లేదని, బీజేపీకి ఓటు వేసి రాజ్యాధికారం దక్కించుకోవాలని కోరారు. మంత్రి జగదీష్‌రెడ్డికి దళితులు అంటే చులకన అని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఓడించి బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వరరావుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణకు అంగీకరించారని, వర్గీకరణ జరిగితే పేద దళిత బిడ్డలకు ఎన్నో అవకాశాలు వస్తాయని తెలిపారు. అందుకు బీజేపీని గెలిపించాలన్నారు. సంకినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిస్తే అవినీతి రహిత పాలన అందిస్తానని, అరాచకాలను అరికడతానని తెలిపారు. దళితులు, బీసీలు కలిసి రావాలని, బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ, చిత్రంలో బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వరరావు

డిస్ట్రిబ్యూషన్ సెంటర్ రెడీ



ఎన్నికల నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ సిద్ధమైంది. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



అభివృద్ధి చూసి ప్రోత్సహించండి



సూర్యాపేటలోని రాజీవ్‌నగర్ చౌరస్తాలో మాట్లాడుతున్న మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

- మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: సూర్యాపేట నియోజకవర్గంలో గడిచిన పదేళ్ల కాలంలో తాను చేసిన అభివృద్ధిని చూసి ప్రోత్సాహం ఇవ్వండని మంత్రి, బీఆర్‌ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. చివరిరోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం సూర్యాపేటలో పట్టణంలో రోడ్ షో నిర్వహించారు. అనంతరం రాజీవ్ నగర్ చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేటను ప్రపంచ స్థాయి పట్టణంగా తయారు చేయాలనేదే తన కల అని పేర్కొన్నారు. దామోదర్ రెడ్డి చేసిన పనులు మీద వేసుకునే ధైర్యం తనకు లేదని, ఆయన తెచ్చిన సకల దరిద్రాలను పారద్రోలడంలో విజయం సాధించానన్నారు. నల్లచెరువుకు నక్లెస్ రోడ్డు వేసి సుందరమయం చేస్తానని తెలిపారు. రాబోయే రెండు, మూడేళ్లలో మూసీని తాగునీటి ప్రాజెక్టుగా చేస్తానని పేర్కొన్నారు.

దమ్ముంటే ఎన్నికల కమిషన్‌కు బాండ్ రాసివ్వాలి

సూర్యాపేట రూరల్: ప్రజలకు బాండ్ పేపర్లు రాసిస్తూ మభ్యపెడుతున్న కాంగ్రెస్ నేతలు.. దమ్ముంటే ఎన్నికల కమిషన్‌కు బాండ్ రాసివ్వాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, సూర్యాపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీష్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం సూర్యాపేట మండలంలోని యండ్లపల్లిలో ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ 6 గ్యారంటీలపై నమ్మకంలేక 42 పేజీలతో గ్యారంటీని తెచ్చారని ఎద్దేవా చేశారు. దాన్ని కూడా ప్రజలు నమ్మడంలేదని బాండ్ పేపర్లు రాసిస్తూ కొత్త డ్రామా ఆడుతున్నారన్నారు. హామీలు అమలు చేయకపోతే తమ ప్రభుత్వాన్ని రద్దు చేయమని బాండ్ ఇవ్వాలి అని సవాల్ విసిరారు. ఇలాంటి బాండ్లు కర్ణాటకలో కూడా రాసిచ్చి పత్తాలేకుండా పోయి మొహం చాటేశారని విమర్శించారు. హామీలు అమలు చేయమని కర్ణాటకలో రైతులు వెంటబడితే పారిపోయారన్నారు. కర్ణాటక తరహాలో తెలంగాణలో సైతం ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. గ్యారంటీ బాండ్ రాసివ్వమని ప్రజలు అడగడంలేదు కేసీఆర్ లాంటి నమ్మకమైన వ్యక్తి చెబితే చాలు అంటున్నారని మంత్రి పేర్కొన్నారు. 'కాంగ్రెస్ లాగా మాది కాగితాల గ్యారంటీ కాదు కేసీఆర్ నోటి మాటే గ్యారంటీ' అని అన్నారు.

ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి

- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకారత్

హుజూర్‌నగర్: ప్రజాస్వామ్యం, ధనస్వామ్యం మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని, ప్రతి ఓటరు ఆలోచించి ఓటు వేసి సీపీఎంను గెలిపించాలని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కారత్ అన్నారు. హుజూర్‌నగర్ సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మిని గెలిపించాలని కోరుతూ మంగళవారం పట్టణంలో రోడ్డుషో, ర్యాలీ నిర్వహించారు. అనంతరం పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. ఇంతకు ముందు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వారు గెలిచి చేసిందేమీ లేదని ఆరోపించారు. పేదల పక్షాన పోరాటం చేసే సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మిని ఆశీర్వదించాలని కోరారు. మల్లు లక్ష్మిని గెలిపిస్తే పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయిస్తామని తెలిపారు. మల్లు లక్ష్మి మాట్లాడుతూ దళితులను కేసీఆర్ ప్రభుత్వం మోసగించిందని, ఇచ్చిన ఏ హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. తనను గెలిపిస్తే మండలాల్లో రైతుల కోసం శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, నాయకులు పారేపల్లి శేఖర్‌రావు, కోట రమేష్, నెమ్మాది వెంకటేశ్వర్లు, పల్లె వెంకటరెడ్డి, నాగారపు పాండు, కౌన్సిలర్ త్రివేణి, ఏకలక్ష్మి, శ్రీకాంత్‌వర్మ, వెంకటరెడ్డి, యాదగిరిరావు, వీరస్వామి, మురళి బ్రహ్మం, యోనా, వీరమల్లు తదితరులు పాల్గొన్నారు. కాగా.. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్‌షోలో అరుణ పతాకాలతో హుజూర్‌నగర్ పట్టణం ఎరుపెక్కింది.



ప్రజలకు అభివాదం చేస్తున్న బృందాకారత్, చిత్రంలో సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మి



ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, కళాకారులు



భువనగిరి పట్టణంలోని అరోరా కళాశాలలో పోలింగ్ సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు చేసిన అధికారులు



నల్లగొండలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రచార వాహనానికి లైట్లు తొలగిస్తున్న దృశ్యం



నల్లగొండ పట్టణంలోని బోయవాడ పోలింగ్ స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



నార్కట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన మహిళా పోలింగ్ స్టేషన్



నల్లగొండలో పోలింగ్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్డీఓ రవి

ఉత్సాహం ఉరకలు..



భువనగిరి: పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డికి మద్దతుగా కార్ల ర్యాలీ తీస్తున్న బీఆర్ఎస్ నాయకులు



చివ్వెంల: ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి జగదీష్‌రెడ్డికి మద్దతుగా బి.చందుపట్ల గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తాళ్లగడ్డ ప్రాంతంలో మంత్రి జగదీష్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్న గౌడ సంఘం సభ్యులు



తిరుమలగిరి(తుంగతుర్తి): ప్రచారంలో గులాబీ కండువా ఊపుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి కిషోర్



అర్వపల్లి: డ్యాన్స్ చేస్తున్న గాదరి కిషోర్ సతీమణి కమల, సూర్యాపేట జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక తదితరులు



మిర్యాలగూడ: ర్యాలీలో కండువా ఊపుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి భాస్కర్‌రావు

జంగ్ తెలంగాణ

అవినీతి ప్రభుత్వాన్ని తరిమేయాలి



దేవరకొండలో ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు

- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లతో ఒరిగిందేమీ లేదు
- బీజేపీ అభ్యర్థి లాలునాయక్‌ను గెలిపించాలి
- దేవరకొండ ప్రజా ఆశీర్వాద సభలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్

దేవరకొండ: రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తరిమేయాలని, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలతో దేశానికి, రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. మంగళవారం దేవరకొండలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేవరకొండ బీజేపీ అభ్యర్థి లాలునాయక్‌కు మద్దతుగా ఇక్కడికి వచ్చిన అశేష జనవాహినిని చూస్తుంటే లాలునాయక్ ఇప్పటికే గెలిచినట్లు కనిపిస్తుందన్నారు. త్వరలోనే తెలంగాణలో బీజేపీ సర్కార్ ఏర్పాటు కానుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను పెంచడంతో పాటు పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి ఏడాదికి ఉచితంగా నాలుగు సిలిండర్లు ఇస్తామని ప్రకటించారు. ఎమ్మెల్యే కాక ముందు ఐదెకరాలున్న ఇక్కడి ఎమ్మెల్యేకు ఇప్పుడు 500 ఎకరాలు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏ రోజు ఏ పార్టీలో ఉంటాడో ఆయనకే తెలియదని ఎద్దేవా చేశారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో అవినీతి రాజ్యమేలుతుందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగం రాకపోయినప్పటికీ.. కేసీఆర్ కుటుంబంలో ప్రతి ఒక్కరికీ రాజకీయ ఉపాధి దొరికిందన్నారు. 2015లో తాను మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణ రైతాంగానికి సాగునీరు కావాలని కేసీఆర్ తనను అడిగారని, దీంతో మహారాష్ట్ర నుంచి కాళేశ్వరానికి నీరిచ్చి తెలంగాణ రైతాంగానికి సహాయ సహకారాలు అందించానని గుర్తు చేశారు. కానీ, కాళేశ్వరం పేరుతో రూ.లక్షల కోట్ల అవినీతి జరుగుతుందని తనకు అప్పుడు తెలియదన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు పూర్తిగా వ్యతిరేకమని, తెలంగాణ రాష్ట్రాన్ని మేమే ఇచ్చామంటూ కాంగ్రెస్ నేతలు అంటున్నారు.. కానీ ఎంతో మంది బలిదానాలతో రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. బీజేపీ సైతం ప్రత్యేక తెలంగాణ కోసం పాటుపడిందని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రానికి బీసీ ముఖ్యమంత్రి కావాలంటే బీజేపీతోనే సాధ్యపడుతుందన్నారు. కేతావత్ లాలునాయక్‌ను దేవరకొండ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.



మాట్లాడుతున్న దేవేంద్ర ఫడ్నవీస్, చిత్రంలో బీజేపీ అభ్యర్థి లాలునాయక్

చిత్తశుద్ధితో పనిచేస్తా: కేతావత్ లాలునాయక్

తనను ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే చిత్తశుద్ధితో పనిచేస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి కేతావత్ లాలునాయక్ అన్నారు. తనకు ఒక్కసారి అవకాశం ఇస్తే ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఇండస్ట్రియల్ పార్కుతో పాటు దేవరకొండను జిల్లాగా ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సభలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఏటి.కృష్ణ, నాయకులు ప్రేమేందర్‌రెడ్డి, చీకోటి ప్రవీణ్, ప్రదీప్‌కుమార్, కర్నాటి సురేష్, గార్లపాటి జితేందర్, చెనమోని రాములు, అంకూరి నర్సింహ, దావ శ్రీను, నక్క వెంకటేశ్ యాదవ్, వనం జగదీశ్వర్, వినోద్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు.. మహాత్మా జ్యోతిరావ్‌పూలే



జ్యోతిబా పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్: సమాజంలో సాంఘిక దురాచారాలు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావ్‌పూలే అని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడలో ఆ సంఘం ఆధ్వర్యంలో 133వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సాగర్ రోడ్డులోని పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఈ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ, మండల అధ్యక్షుడు నరేష్ ముదిరాజ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామరాజు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తైక్వాండో అసోసియేషన్ ఇన్‌చార్జ్‌ల నియామకం

నల్లగొండ టూటౌన్: తైక్వాండో అసోసియేషన్ నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్‌లుగా నాగిళ్ల రమేష్, చింత అనిల్‌కుమార్‌ను నియమిస్తూ తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురువ శ్రీహరి ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో వీరిద్దరికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను నియమించిన అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

హుజూర్‌నగర్ : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన మర్రి రవీందర్ రెడ్డికి ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు మర్రి మధుకర్‌రెడ్డి (28) సీఏ పూర్తి చేసి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేసి ఏడాది క్రితం మానేశాడు. మరో ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. సుమారు 25రోజుల క్రితం హైదరాబాద్ నుంచి హుజూర్‌నగర్ వచ్చాడు. తన తండ్రి వద్ద ఉండడం ఇష్టం లేక పట్టణంలోని స్నేహితుడు రెడ్డిచర్ల నిఖిల్‌తో కలిసి పాల్వాయి సరోజినీ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. రూంలో ఒక్కడే ఉంటూ ఆర్థిక ఇబ్బందులతో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. మిత్రుడు గమనించగ అప్పటికే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరికష్ణ తెలిపారు.

కబడ్డీ పోటీలకు ఎంపిక

ఆలేరురూరల్ : మండలంలోని గొలనుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కాళ్ల మనీష, మారుపల్లి అర్చన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. నిజామాబాద్ జిల్లాలో డిసెంబర్ 3నుంచి 6వ తేదీ వరకు జరగనున్న పోటీల్లో వీరిద్దరూ పాల్గొంటారని పీఈటీ పూల నాగయ్య తెలిపారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశాం



మాట్లాడుతున్న ఆర్వో వెంకట్‌రెడ్డి

తుంగతుర్తి : ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రంలోని ఎన్నికల కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తుంగతుర్తి శాసన సభ నియోజకవర్గంలో అనుబంధ జాబితా కలుపుకొని 2,55,017మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీరిలో పురుషులు -1,27,578, మహిళలు -1,27,431, ఇతరులు-8 మంది ఉన్నారని చెప్పారు. నియోజకవర్గంలోని 326 పోలింగ్ కేంద్రాల్లో పర్యవేక్షణకు 37 మంది రూట్ ఆఫీసర్లు, 1,304 మంది పోలింగ్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 106 అతి సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను, 55 సమస్యాత్మకమైన ప్రాంతాలను గుర్తించామని అన్నారు. మైక్రోఅబర్వర్స్ 61మందిని, వెబ్ కాస్టింగ్ -161 మందిని నియమించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఎస్ఎస్‌టీ -06, ఎంసీసీ -11, వీఎస్‌టీ-3, ఏఈఓ-1 టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 59 బస్సులు, 43 ఇతర వాహనాలను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు.

అందుబాటులో ఉంటూ సేవ చేస్తా

అర్వపల్లి : స్థానికుడినైన తనను గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని తుంగతుర్తి కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేలు అన్నారు. జాజిరెడ్డిగూడెంలో సోమవారం రాత్రి జరిగిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేస్తామని చెప్పారు. ఊరు ఊరంతా రాజకీయాలకతీతంగా తన ప్రచారానికి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, శిగ నసీర్‌గౌడ్, ఎంపీటీసీ నాగమ్మ, దాసరి సోమయ్య, నర్సింగ కృష్ణమూర్తి, గుడిపల్లి సోమిరెడ్డి, ఎల్లంల కొమిరెల్లి, మామిడి సత్యనారాయణ, కుంభం మధు, సోమయ్య, జలేంధర్, బింగి కృష్ణమూర్తి, కిరణ్, ఖాజ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలే కాంగ్రెస్‌కు బలం.. బలగం

తిరుమలగిరి : కాంగ్రెస్ పార్టీకి బలం, బలగం ప్రజలేనని ఆ పార్టీ అభ్యర్థి మందుల సామేల్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుమలగిరి పట్టణంలో మంగళవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక తెలంగాణ చౌరస్తాలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు విసిగిపోయారని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే హామీలన్నీ అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు వై.నరేష్, దుంపల కృష్ణారెడ్డి, సుంకరి జనార్దన్, బత్తుల శ్రీను, కందుకూరి అంబేద్కర్, మూల అశోక్‌రెడ్డి, పేరాల వీరేష్, కొండల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాముగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జాజిరెడ్డిగూడెంలో మాట్లాడుతున్న సామేలు

విద్యుదాఘాతంతో హార్వెస్టర్ ఆపరేటర్ మృతి

కోదాడరూరల్ : విద్యుదాఘాతంతో హార్వెస్టర్ ఆపరేటర్ మృతిచెందాడు. సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన కొండి హరికృష్ణ(17) హార్వెస్టర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. వరి కోసేందుకు సోమవారం రాత్రి కోదాడ మండలం దోరకుంట నుంచి కాపుగల్లు వైపు లారీపై హార్వెస్టర్‌ను తీసుకొస్తున్నాడు. ఈ క్రమంలో కాపుగల్లు శివారులో విద్యుత్ తీగలు కిందకు ఉన్నాయి. ఆ తీగలను వారి వద్ద కర్రలతో పైకి లేపుతుండగా ఓ తీగ వచ్చి హరికృష్ణపై పడటంతో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి అంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డీజే సౌండ్‌తో గుండెపోటుకు గురై మహిళ మృతి



అమృతమ్మ(ఫైల్)

కొండమల్లేపల్లి: దేవరకొండ నియోజకవర్గంలోని కొండమల్లేపల్లిలో ఓ రాజకీయ పార్టీ ప్రచారం నిర్వహిస్తున్న క్రమంలో డీజే సౌండ్ కారణంగా ఓ మహిళ గుండెపోటుకు గురై మృతి చెందింది. కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన గుంటోజు అమృతమ్మ(51) దినసరి కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మంగళవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోర్ పిన్ డిజే సౌండ్స్‌తో తీవ్రమైన శబ్దాన్ని తట్టుకోలేక అమృతమ్మ గుండెపోటుకు గురై కుప్పకూలింది. దీంతో స్థానికులు ఆమెను దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అమృతమ్మను పరీక్షించిన వైద్యులు.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు ఏమీ అందలేదని పోలీసులు తెలిపారు.

కోళ్ల దాణా లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా

మాడుగులపల్లి: మండల పరిధిలోని టోల్ ప్లాజా వద్ద కోళ్ల దాణా బస్తాల లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తాపడింది. వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నుంచి కోళ్ల దాణా(సోయా పొట్టు) బస్తాల లోడ్‌తో లారీ ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు జిల్లాకు బయల్దేరింది. మార్గమధ్యలో మాడుగులపల్లి టోల్‌ప్లాజా సమీపంలో రోడ్డు దిగుడుగా ఉండడాన్ని డ్రైవర్ గుర్తించకపోవడంతో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. దాణా బస్తాలను మరో లారీలోకి లోడ్ చేసి క్రేన్ సాయంతో బోల్తా పడిన లారీని పైకెత్తారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

పెన్‌పహాడ్ : కరెంట్ షాక్‌తో రైతు మృతిచెందాడు. పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామానికి చెందిన మామిడి కృష్ణయ్య(36) తనకున్న రెండు ఎకరాల భూమితో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఉదయం బోరు మోటార్ వద్దకు వెళ్లి స్టార్టర్‌ను సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటరత్నం తెలిపారు.

మానవ అక్రమ రవాణా అతిపెద్ద నేరం



మాట్లాడుతున్న బాలరామకృష్ణ

నాగార్జునసాగర్: ఉద్యోగాలు ఇప్పిస్తాం, సినిమాల్లో అవకాశాలు కల్పిస్తామంటూ మహిళలు, యువతులకు డబ్బు ఆశ చూపి ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలించి వ్యభిచార గృహాలకు విక్రయిస్తున్నారని, ఇది అతిపెద్ద నేరమని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ మేనేజర్ కె.బాలరామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం సాగర్‌లోని బీసీ గురుకుల విద్యాలయంలో ఆ సంస్థకు చెందిన పద్మశ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ సహకారంతో ప్రిన్సిపాల్ రవీంద్రాచారి, రజనీకర్ ఆధ్వర్యంలో విద్యార్థుల చైతన్య కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలను అపహరించి వారి శ్రమను దోచుకోవడంతో పాటు అవసరం మేరకు అవయావలను తొలగించి ఇతరులకు విక్రయిస్తారని పేర్కొన్నారు. నేటి కాలంలో యువత మొబైల్ ఇంటర్నెట్‌ద్వారా సైబర్ ట్రాఫింగ్‌కు గురవుతున్నారని తెలిపారు. అందరిని చైతన్యపరిచేందుకు విద్యాలయాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా, శిశు సంక్షేమ, పోలీస్, విద్యా, న్యాయశాఖల సమన్వయంతో ఇప్పటి వరకు 28,200మంది అమ్మాయిలను, మహిళలను కాపాడి వారికి పురావాసం కల్పించినట్లు తెలిపారు. సెల్ మెసేజ్‌లు, వ్యక్తులపై అనుమానం వస్తే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్ శ్రావ్యస్మృతి, శివ, అనిల్, ఫ్యాకల్టీ పాల్గొన్నారు.


పోలింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

- ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం: పోలింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ హాల్‌లో రూట్ మొబైల్స్ డ్యూటీ సిబ్బందితో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించడం, పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూమ్‌కు తరలించడం చాలా ప్రధానమైనదని, ఈ విధుల్లో ఎలాంటి అవరోధాలు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సెంట్రల్ ఆర్మ్ ఫోర్స్ సిబ్బందితో మాట్లాడి ఇంటిగ్రేటెడ్ మార్కెట్, వికాస్ ఫార్మసీ కళాశాలలో భద్రత కల్పించాలని కోరారు. ఆయన వెంట డీఎస్పీ నాగభూషణం, సీఐలు రాజశేఖర్, అశోక్‌రెడ్డి తదితరులున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తిరుమలగిరి (తుంగతుర్తి): ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాహుల్ హెగ్డే సిబ్బందికి సూచించారు. మంగళవారం తిరుమలగిరిలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు.



సూచనలు చేస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

ప్రణాళిక ప్రకారం విధులు నిర్వహించాలి

తుంగతుర్తి: ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎక్కడా సమస్యలు తెలెత్తకుండా చూడాల్సిన బాధ్యత పోలీసు అధికారులపై ఉందని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. మంగళవారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో ఎన్నికల బందోబస్తు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎన్నికల రోజు విధులు ప్రణాళిక ప్రకారం నిర్వర్తించాలని తెలిపారు. సమావేశంలో డీఎస్పీలు నాగభూషణం, రవి, సీఐలు మురారి, శివశంకర్, ఎస్ఐలు పాల్గొన్నారు.